క్లుప్తంగా

దైవచింతనతో మనశ్శాంతి



గ్రామ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: మండలంలోని పోతంగి గ్రామంలో పెద్దదేవుడు పండగను ఘనంగా నిర్వహించారు. రెండు రోజులుగా జరిగిన ఈ జాతరలో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఇందులో భాగంగా సోమవారం జరిగిన వేడుకలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావం కలిగి ఉండాలని, దైవ చింతనతో మనశ్శాంతి కలుగుతుందన్నారు. గిరిజన సంప్రదాయాలను పరిరక్షించుకోవాలన్నారు. ఆలయం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. సర్పంచ్ వెంకటరావు, కమిటీ సభ్యులు మధునరావు, సుబ్బారావు, కె.సుబ్బారావు, భగత్‌రాం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు ఆధ్వర్యంలో ఉజ్వల యోజన పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేయనున్నట్టు మండల పార్టీ కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ తెలిపారు.నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

పేదలకు దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న దూడ స్మిత్

రంపచోడవరం: బోర్నగూడెంలోని మాసిదోనియా చర్చిలో పాస్టర్ డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో సోమవారం గ్రాండ్ క్రిస్మస్ వేడుక ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏఎంసీ డైరెక్టర్ దూడ స్మిత్ మాట్లాడుతూ పేద వారిని ఆదుకోవాలన్నారు. పేదలకు దుస్తులకు పంపిణీ చేశారు. పాస్టర్ కరుణాకర్, పాస్టర్ రత్నం ఎలీషా, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సేవతోనే సంపూర్ణ ఆనందం



చిన్నారులకు దుస్తులను పంపిణీ చేస్తున్న సంస్థ డైరెక్టర్ అనూష, తదితరులు

అనంతగిరి: మండలంలోని గుమ్మ పంచాయతీ చెరుకుబిడ్డ గ్రామంలోని వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని సోమవారం 120 మంది నిరుపేదలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం ఎంపీపీ పాఠశాలలోని 80 మంది విద్యార్థులకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మళ్ల అనూష మాట్లాడుతూ సేవ చేయడంతో సంపూర్ణ ఆనందం కలుగుతుందన్నారు. ఏజెన్సీలో 15 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అనంతరం 300మందికి భోజనం అందజేశారు. సంస్థ మేనేజర్ లక్ష్మణ్‌రావు, నరేంద్ర, ఉపాధ్యాయులు సుధారాణి, శ్రీను, దేముడు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ రామన్న

అరకులోయ రూరల్: మండలంలో బస్కి పంచాయతీ పరిధిలోని కొంత్రయిగూడ, బొండగూడ గ్రామల్లో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు సోమవారం జల్‌జీవన్ మిషన్ నిధుల నుంచి సుమారు రూ,25 లక్షలతో బోరు, ఇంటింటికీ పైపులైన్ పనులను వైస్ ఎంపీపీ రామన్న ప్రారంభించారు. ఆయన మాట్లాడుతు తాగునీరు లేని ప్రతి గ్రామంలో రక్షితనీటి సౌకర్యం అందించడమే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. రెండు గ్రామలకు తాగునీరు సదుపాయం కలుగుతుండడంతో గ్రామస్తులు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అలా..చక్కబడి



సుజనకోట ఎంపీయూపీ పాఠశాల

- నాడు–నేడుతో పాఠశాలల్లో అభివృద్ధి పనులు
- మారిన సర్కారు బడుల రూపురేఖలు
- అధునాతన సదుపాయాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

పైకప్పు, తలుపులు, కిటికీలు లేని పాఠశాలలు..చినకుపడితే బడికి సెలవే..గచ్చులేని తరగతి గదులు ఉండేవి.. టీడీపీ ప్రభుత్వ హయాంలో సర్కారు పాఠశాలలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. బడుల్లో కనీస సదుపాయాలు కరువయ్యాయి. ఉపాధ్యాయుల కొరత, సమస్యల నడుమ విద్యార్థులు నానా అవస్థలతో చదువులు సాగించారు..అదంతా గతం..వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేశారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన సదుపాయాలతో కూడిన నాణ్యమైన చదువుకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చారు..





దారపల్లి పాఠశాల పరిస్థితి

ముంచంగిపుట్టు: గత టీడీపీ ప్రభుత్వం సర్కారు పాఠశాలల్లో ఎటువంటి సౌకర్యాలు కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తూ వచ్చింది. దీంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతూ చదువులు కొనసాగిస్తూ వచ్చారు. అదంతా గతం.. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వ విద్యాలయాల రూపురేఖలు మార్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది.దీంతో విద్యాలయాల్లో కొత్త సొబగులు సంతరించుకున్నాయి.నాడు శిథిలమైన పాఠశాలల గదుల్లో నేలపై కూర్చునే బదులుగా అందమైన డెస్క్‌లపై కూర్చునే సదుపాయాలు, రంగు, రంగుల బొమ్మలతో కూడిన గోడలు దర్శనమిస్తున్నాయి. ఆధునిక సదుపాయాలు, నాణ్యమైన విద్యతో ప్రభుత్వ పాఠశాలలు మారాయి. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు పాఠశాలల్లో చదివించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా పాఠశాలల్లో గణనీయంగా విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఇది కాదా అభివృద్ధి అని గిరిజనులు సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులివీ...

➡ కించాయిపుట్టు పంచాయతీ దారపల్లి మండల పరిషత్ పాఠశాలలో మొదటి విడతలో రూ.19లక్షలు, రెండవ విడతలో రూ.4లక్షలతో పాఠశాల భవనాన్ని పూర్తిగా మరమ్మతులు చేసి నూతన భవనంగా తీర్చిదిద్దారు. తాగు నీరు సౌకర్యాం కల్పించారు. మరుగు దొడ్లు ఏర్పాటు చేశారు.పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించారు.గోడలపై రంగు రంగుల బొమ్మలతో నూతన వాతావరణం కల్పించారు.

➡ సుజనకోట ఎంపీయూపీ పాఠశాలలో 26 లక్షలతో తరగతి గదులు మరమ్మతులు చేసి ఫర్నిచర్ ,టైల్స్, రంగులు, తాగునీరు, ఎలక్ట్రికల్ పనులు చేయించారు.

➡ ముంచంగిపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల–2లో మొదటి విడతలో రూ.22.88 లక్షలతో పూర్తిగా ఆశ్రమ పాఠశాల రూపురేఖలు మారిపోయాయి.వంటశాలను బాగు చేశారు.ఫర్నీచర్ ఏర్పాటు చేశారు.భవనాలకు మరమ్మతులు చేసి రంగులు వేసి అందమైన బొమ్మలను వేసి మంచి వాతావరణం కల్పించారు.

➡ చోటముక్కిపుట్టు ఎంపీయూపీ పాఠశాలలో రూ.18లక్షలతో భవనాలు మరమ్మతులు చేశారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఆడుకునే విధంగా ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. ప్రహరీ నిర్మించి, గేటు ఏర్పాటు చేశారు. వంటశాలకు నూతన భవనం నిర్మించారు. రంగుల రంగుల బొమ్మలతో ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దారు.

93 పాఠశాలల్లో నాడు–నేడుతో అభివృద్ధి

మండలంలో మొత్తం 202 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. నాడు నేడు పథకం ద్వారా మొదటి విడతలో 39 పాఠశాలకు 8కోట్ల48లక్షలు మంజూరు చేశారు.పనులు అన్ని సకాలంలో పూర్తి చేసి విద్యార్థులకు మౌలిక సదుపాయలు కల్పించారు.ఫేజ్–2లో 54 పాఠశాలను ఎంపిక చేసి16 కోట్ల58లక్షలు మంజూరు చేశారు. పాఠశాలలో 90 శాతం పనులు పూర్తి చేశారు. రంగులు, విద్యుత్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది.



సుజనకోట పాఠశాలలో విద్యార్థులు

మండలం: ముంచంగిపుట్టు

పంచాయతీలు	గ్రామాలు	కేజీబీవీ
23	374	1

ఎంపీయూపీ, ఎంపీపీ పాఠశాలు	ఆశ్రమ పాఠశాలలు
185	14

జెడ్పీ పాఠశాల	ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం పాఠశాల
1	1

విద్యార్థుల సంఖ్య **11,893**



చోటముక్కిపుట్టు పాఠశాలలో విద్యార్థులు



దారపల్లి పాఠశాలలో ఆడుకుంటున్న విద్యార్థులు

పెరిగిన విద్యార్థుల సంఖ్య



నాడు–నేడు ద్వారా మండలంలో మొదటి విడతలో 39 పాఠశాలలకు పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించాం. తరగతి గదులలో టైల్స్ అమర్చడం జరిగింది. తాగు నీరు, భవనాల మరమ్మతులు చేయించాం. అవసరమైన మేజర్, మైనర్ పనులు చేపట్టాం. పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయలు కల్పించడం జరిగింది. గతం కంటే ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య పెరిగింది.

– కె.కృష్ణమూర్తి, ఎంఈవో, ముంచంగిపుట్టు

సంతోషంగా ఉంది



ప్రభుత్వం నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. మా పిల్లలు పాఠశాలకు గతంలో పంపేందుకు భయం వేసేది..కానీ నేడు పక్కా భవనాలు, తాగునీరు, బెంచీలు,టైల్స్, ప్రహరీలు నిర్మించి ప్రైవేట్ పాఠశాలలకు తలదన్నే విధంగా తయారు చేసింది. ఒక రంగు రంగుల బొమ్మలతో ఆహాదకరమైన వాతావరణం సంతరించింది.

– సీసా ప్రసాద్, విద్యార్థిని తండ్రి, ఎంపీపీ పాఠశాల, దారపల్లి, ముంచంగిపుట్టు

కష్టాలు తీరాయి



గతంలో పాఠశాలకు వెళ్లేందుకు భయం వేసేది. పాఠశాల భవనం ఎప్పుడూ పడిపోతుందో అని నిత్యం ఆందోళన చెందేవారం. జగన్ మావయ్య ప్రభుత్వం మా పాఠశాలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించింది .బెంచీలు ఏర్పాటు చేయడం నేల మీద కూర్చేనే అవస్థ తప్పింది.నాడు నేడుతో మా పాఠశాల కష్టాలు అన్ని తీరిపోయాయి.

– రణ ఫాతీమ, విద్యార్థిని, 5వ తరగతి, ఎంపీయూపీ పాఠశాల, సుజనకోట

జగనన్నతోనే సుపరిపాలన సాధ్యం



ఇరగాయిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధర్‌స్వామి



జర్రకొండలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



లగిసపల్లిలో బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎస్టీ సెల్ అధ్యక్షురాలు, జి.మాడుగుల జెడ్పీటీసీ వెంకటలక్ష్మి



గురుపల్లిలో పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీటీసీ రామకృష్ణపాత్రుడు, నేతలు

అరకులోయ రూరల్: జిల్లా వ్యాప్తంగా వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ప్రజల విశేష స్పందన లభిస్తోంది. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను, చేపట్టిన అభివృద్ధి పనుల గురించి తెలియజేస్తున్నారు.

పాడేరు రూరల్: మండలంలోని లగిసపల్లిలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు, జి.మాడుగుల జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో మన్య ప్రాంతం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. ఈనెల 21న చింతపల్లిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటిస్తున్నారని, ఈ సందర్భంగా జరగనున్న బహిరంగ సభకు గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పార్టీ జోనల్ ఇన్‌చార్జి కిముడు విశ్వ, నాయకులు పాల్గొన్నారు. ఎ కొడెలి పంచాయతీ గురుపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ పాత్రుడు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మండలంలోని ఇరగాయి పంచాయతీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధర్‌స్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, వైస్ ఎంపీపీ రామన్న, మండల కన్వీనర్ సంపత్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు రాంచందర్, చెల్లమ్మ, నాయకులు చిరంజీవి, సన్యాసిరావు, రాజ్‌కుమార్, బొంజునాయుడు, నర్సింగ్, గురు, సచివాలయం ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట:జర్రకొండ పంచాయతీలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కల్చరల్ విభాగ అధ్యక్షుడు దిలీప్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు పి.సింహాచలం, జేసీఎస్ మండల ఇన్‌చార్జి కె.రామకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండలరావు, నాయకులు సదాశివరాజు, చిన్నబ్బి, రాజారావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: వాలసీలో జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆర్.స్వామి, సర్పంచ్ సన్యాసిరావు, గురుమూర్తి, బాక సన్యాసిరావు, పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్ఠి

చింతపల్లిరూరల్: మండలంలో చౌడుపల్లిలో సుబ్రమణ్యేశ్వర స్వామి షష్ఠి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సారెను సమర్పించారు. అనంతరం నిర్వాహకులు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

దేవీపట్నం: సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా ఫజుల్లాబాద్‌లోని కొండపైగల సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులతో కలిసి ఎమ్మెల్సీ అనంతబాబు కుటుంబసమేతంగా పాల్గొన్నారు.



సారె ఊరేగింపులో భక్తులు

అడ్డతీగల: అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహించారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ అయ్యప్పశర్మ తదితరులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు జరిపారు.

అంగన్‌వాడీ, ఎఫ్‌ఏల ఆందోళన

చింతూరు: సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం స్థానిక ఐటీడీఏ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ 26 వేలు చెల్లించాలని, జీవిత భీమా సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం వారు ఐటీడీఏ ఏపీవో కంచర్ల సుజాతకు వినతిపత్రం అందజేశారు. పెంటయ్య, సత్యనారాయణ, సీతామహాలక్ష్మి, సురేష్, దిలీప్, జయమ్మ, సత్యవతి, కనకదుర్గ పాల్గొన్నారు.

చింతూరు: కనీస వేతనం అమలు చేయడంతో పాటు ఉద్యోగభద్రత కల్పించాలంటూ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు సోమవారం స్థానిక ఐటీడీఏ ఎదుట ఆందోళన నిర్వహించారు. వారు ఐటీడీఏ ఏపీవో కంచర్ల సుజాతకు వినతిపత్రం అందచేశారు.

ఇసుక, బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట



మాట్లాడుతున్న తహసీల్దార్ పృథ్వీ

ఎటపాక: మట్టి, ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తహసీల్దార్ పృథ్వీ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవాం జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో పలు శాఖల అభివృద్ధి పనులపై చర్చించారు. రెవెన్యూశాఖ పనుల ప్రగతిని వివరించారు.నిబంధనలు, చట్ట ప్రకారం మేరకే భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఎటువంటి అవకతవకలకు తావులేదని స్పష్టం చేశారు. రేషన్ దుకాణాల్లో అక్రమాలకు పాల్పడుతున్న ముగ్గురు డీలర్లపై త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీటి పైపులైన్ పనుల పర్యవేక్షణ బాధ్యతలు డ్వాక్రా సిబ్బందికి ఇవ్వడంపై పలువురు ఎంపీటీసీలు ప్రశ్నించారు. వ్యవసాయశాఖ అధికారి రాబిన్ మాట్లాడుతూ గత ఏడాది ప్రభుత్వం 6,037 క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేసిందని, ఈ ఏడాది క్వింటా రూ.2.183లతో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. హెచ్‌ఓ ముత్తయ్య మాట్లాడుతూ తుపాను కారణంగా నష్టపోయిన పంటల సర్వేను ఈ నెల 11 నుంచి 18లోగా పూర్తి చేస్తామన్నారు. బాధిత రైతులకు న్యాయం జరిగేలా పోలవరం పరిహారం చెల్లించిన భూముల్లోని మిర్చి పంటకు కూడా నష్ట పరిహారం ఇచ్చే విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. నాడు–నేడు పథకం రెండవ విడతలో 27 పాఠశాలల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వ నిధులు పెంచిందని ఎంఈఓ బాలరాజు చెప్పారు. ఎంపీపీ కాక కామేశ్వరి, ఎంపీడీవో ప్రేమ్ సాగర్, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రమేష్

జి.మాడుగుల: మండలంలో గడుతూరు, కె కోడాపల్లి పంచాయతీల్లో పలు గ్రామాల్లో సీఐ రమేష్ సోమవారం పర్యటించారు. గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే సంబంధిత ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గంజాయి సాగు, రవాణా, సారా తయారీ, విక్రయాలు వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే పోలీస్ చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని భంగం కల్పించినా అల్లర్లు, గొడవలు చేసినటువంటి వ్యక్తులపై కేసులు తప్పవన్నారు. గంజాయి సాగు చేయవద్దని, వాణిజ్య పంటలను సాగు చేయాలని సూచించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



మధురమామిడిలో వరి పంట దిగుబడులు పరిశీలిస్తున్న ఏవో పాత్రుడు

జి.మాడుగుల: వ్యవసాయ పద్ధుతులపై వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎల్.పాత్రుడు తెలిపారు. మండలంలో సొలభం పంచాయతీ మధురమామిడి గ్రామంలో మత్స్యదేవత ఎఫ్‌పీవో యూనిట్ ఇన్‌చార్జి ఐ.మహేశ్వరి ఆధ్వర్యంలో సోమవారం రైతు పి.దమరి వరి పొలంలో చేపట్టిన పంటకోత ప్రయోగం ద్వారా 14.17కిలోలు ధాన్యం దిగుబడి వచ్చినట్టు వ్యవసాయ శాఖ అధికారి, సిబ్బంది గుర్తించారు. గ్రామాల్లో రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఎంపీఈవో, వీహెచ్‌ఎలు, ఐసీఆర్పీఎస్, రైతులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ కుటుంబాన్ని ఆదుకుంటాం



డీటీ రామ్మూర్తి కుటుంబాన్ని పరామర్శిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

డుంబ్రిగుడ: డిప్యూటీ తహసీల్దార్ రామ్మూర్తి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఇటీవల ఆయన డిటీగా అరకులోయ మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా రామ్మూర్తి భౌతికకాయాన్ని ఐటీడీఏ పీవో అభిషేక్ సోమవారం సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. బాధిత కుటుంబానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ రూ.2లక్షలు మంజూరు చేశారు. దహన సంస్కారాల నిమిత్తం ఐటీడీఏ పీవో అభిషేక్ రూ.25వేలు నగదును మృతుని కుటుంబానికి అందజేశారు. రామ్మూర్తి కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ తరపున రూ.5వేలు నగదును ఇచ్చారు. చిన్నికృష్ణ, త్రినాథరావు, తహసీల్దార్లు వేణుగోపాల్, నాగమ్మ ఉన్నారు.

చింతచెట్టు కూలి ఇల్లు ధ్వంసం

సీలేరు: జి.కె.వీధీ మండలం దారకొండ పంచాయతీలో కొంగపాకలు గ్రామంలో తగ్గి అనసూయ ఇంటిపై ఆదివారం అర్ధరాత్రి అకస్మాత్తుగా చింతచెట్టు కూలడంతో ఇల్లు ధ్వంసం అయి రేకులు విరిగిపోయాయి. ఇంట్లో నిద్రిస్తున్న వారికి చిన్న చిన్న గాయాలతో బయటపడ్డారు. ఇటీవలే అనసూయ భర్త చిన్నారావు మృతి చెందడం, ఇల్లు ధ్వంసం కావడంతో నిరాశ్రయులయ్యామని వాపోయారు.

సంక్షేమ పథకాలపై అవగాహన



యువతీ, యువకులకు అవగాహన కల్పిస్తున్న నేచర్ సంస్థ ప్రతినిధులు

అనంతగిరి: టోకూరు పంచాయతీ బగ్మారవలస గ్రామంలోని సోమ వారం నేచర్ సంస్థ ఆధ్వర్యంలోని 96 మంది యువతీ, యువకులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ వికాస్ బాలరాజు మాట్లాడుతూ అమ్మఒడి, పీఎం కిసాన్, ఆరోగ్యశ్రీ, రైతు భరోసా, చేయూత తదితర సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు.

జగనన్న పర్యటనను విజయవంతం చేయండి

కొయ్యూరు: చింతపల్లిలో ఈనెల 21న నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఎంపీపీ రమేష్ కోరారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మన్య ప్రాంతాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో అభివృద్ధి చేశారన్నారు. చింతపల్లిలో గురువారం నిర్వహించనున్న ముఖ్యమంత్రి జగనన్న కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.